

ఒక దెయ్యంతో నా ప్రేమకథ

– డా.యండమూరి వీరేంద్రనాథ్

అంకితం

అపరాధ పరిశోధన (డిటెక్టివ్) నవలని తెలుగు పాఠక లోకానికి పాపులర్ చెయ్యటంలో ఆద్యుడు

కొమ్మూరి సాంబశివరావు కి

\- రచయిత

కృతజ్ఞతలు:

దెయ్యం తపున ఒక లాయరు కేసు టేకప్ చేసిన కథాంశం తో నవల వ్రాయమని సూచన ఇచ్చిన ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ, మానసిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఇండ్ల విశాల్, రాగమాలికల వివరణ చెప్పిన గొర్తి బ్రహ్మానందం, పురాణ, ఇతిహాసాసాల గురించి వివరించిన బాలాంత్రపు రమణ, ఇంటరాగేషన్ విధానాల గురించి వివరించిన రిటైర్డ్ ఐ.పి.యస్ ఆఫీసర్ శ్రీరావులపాటి సీతారామారావు, లీగల్ సమాచారం అందజేసిన లాయర్ గోపాల్ సింగ్, ఫేస్–బుక్ గురించి వివిధ వివరాలు చెప్పిన వి.వి.ఆర్.కిషన్, ఎ.ఐ. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన అల్లాణి శ్రీధర్,

కలీమా, జకాత్ ల గురించి చెప్పిన ఖాదిర్ బాబు,ఎందఱో మహానుభావులు. అందరికీ కృతజ్ఞతలు.

...

ఇదో చందమామ కథ. ఆస్తిక–నాస్తిక–దెయ్యాల చర్చ వద్దు.

\- యండమూరి

(గతసంచిక తరువాయి)

"**చూడు** వెంకటేశ్వర్లూ. ఇంత లంచం నీ జీవితంలో నీకెవరూ ఇచ్చి ఉండరు. ఆ రోజు ఎన్‌కౌంటర్ ఎలా జరిగిందో చెప్పు" అన్నాను.

ఈ సంభాషణ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఇంట్లో జరుగుతోంది. ఇద్దరం ఎదురుగా కూర్చున్నాం. మధ్య టేబుల్ మీద నోట్ల కట్టలు గుట్టగా ఉన్నాయి. పది వేలే. కానీ పది రూపాయల నోట్ల కట్టలు. ఇల్లు బేరం చేసేటప్పుడూ, అగ్రిమెంట్ వ్రాసుకునేటప్పుడు, లంచం ఇచ్చేటప్పుడూ, ఎదురుగా పెద్ద పెద్ద కట్టలు కనబడుతూ ఉంటే అవతలి వ్యక్తి సగం దిగి వస్తాడనేది మనస్తత్వం మీద చిన్న ట్రిక్.

"చెప్పు?"

"ముద్దాయిల్ని వ్యాన్‌లో పోలీస్ స్టేషనుకి తీసుకెళ్తున్నాం సార్. రోడ్డు పక్కన బండి ఆగినప్పుడు, ముద్దాయి బయటకు దూకి తుప్పల్లోకి పరిగెత్తాడు. ఎంత హెచ్చరించినా ఆగలేదు. తప్పేది లేక వెనుక నుంచి మా ఇనస్పెక్టర్ కాల్చేసారు".

"అది మీ రిపోర్టులో ఉన్నది. అసలేం జరిగిందో అది చెప్పు" అన్నాను.

అతడు మాట్లాడలేదు.

"చూడు వెంకటేశ్వర్లూ..! అందరికీ తెలిసిన విషయం చెప్పటానికి నీకెవరు డబ్బు ఇస్తారయ్యా?" అన్నాను. అతడు మాట్లాడలేదు. "సరే అయితే. నీతో పాటు అదే వ్యాన్‌లో రామాంజనేయులు, ప్రకాశం కూడా ఉన్నాబు కదా. ఇందులో సగం వారికిస్తే జరిగింది మొత్తం వాళ్ళే చెప్తారు".

దానికి కూడా అతను నోరు విప్పలేదు.

"విషయం మనిద్దరి మధ్యే ఉంటుంది. ఎక్కడా బయట పెట్టను. నీ మీదకి ఏ గొడవా రాదు. ధైర్యంగా చెప్పు. ఏం జరిగింది?"

అతను కరుగుతున్నాడు. కానీ తటపటాయిస్తున్నాడు. దూకుదామా వద్దా అని తటపటాయిస్తూన్న మనిషిని వెనక నుంచి నీళ్ళలోకి తోసినట్టూ "ఇదేమీ సాక్ష్యం కాదు. నువ్వు చెప్పిన విషయాన్ని నేనే విధంగానూ కోర్టులో ఉపయోగించను. భానుమూర్తి నా క్లయింట్. కేసు టేకప్ చేసే ముందు వాళ్ళు రౌడీలా? నిజంగా హత్య చేశారా? వ్యానులోంచి దూకి పారిపోయేటంత ధైర్యం వాళ్లకి ఉన్నదా? ఈ విషయాలన్నీ తెలుసుకోవడం కోసం నీ దగ్గరకి వచ్చానే తప్ప మీ మీదా, మీ ఇనస్పెక్టర్ మీదా కేసు పెట్టడానికి కాదు. నిజానికి నేను ఇస్తున్నది నీకు లంచం కాదు. విషయం చెప్పినందుకు బహుమతి" అన్నాను.

ఒంటె మీద ఆఖర గడ్డి పరక పడ్డట్టూ ఈ మాటలకి పూర్తిగా కరిగి, వెంకటేశ్వర్లు చెప్పటం మొదలు పెట్టాడు: "వాళ్లు హత్య చేసేవాళ్లలా కనిపించలేదు సార్. ప్రభాకర్ కాస్త నిబ్బరంగా ఉన్నాడు కానీ, అతడి బావమరిది మాత్రం వ్యాన్ ఎక్కినప్పటి నుంచీ చిన్న పిల్లాడిలా ఏడుస్తూ ఉన్నాడు. మా ఇనస్పెక్టరు బండి పక్కన ఆపు చేసి ఇద్దర్నీ దింపాడు. ప్రభాకర్‌ని పిస్టల్‌తో కాలుస్తూ ఉండగా ఏడ్చే కుర్రాడు తుప్పల్లోకి పరిగెత్తాడు. ఇనస్పెక్టర్ చాలా కంగారు పడ్డాడు. మాతో అంతా వెతికించాడు. ముద్దాయి దొరకలేదు".

"డ్రైవర్ తనంతట తానే వ్యాను ఆపాడా? మురళీధర్ ఆపమంటే ఆపాడా?"

"నేచర్ కాల్ కోసం ఆపాడు సర్."

"అంతేనా? లేక 'ఫలానా చోటుకు వెళ్ళగానే ఆపు' అని ఇనస్పెకర్ ముందే చెప్పాడా?"

"తెలీదండీ. వాళ్ళిద్దరూ ముందే ఏమన్నా మాట్లాడుకున్నారేమో మాకు తెలీదు".

"ఇదిగో తీసుకో. పిల్లలకి ఏదన్నా కొను. నీ భార్యకి కూడా" నోట్ల కట్ట ముందుకి జరిపి బయటకి నడిచాను.

★★ ★★ ★★

త్రినేత్రిని గుడికి తీసుకు వెళ్తూ, ప్రభాకర్ ఎన్‌కౌంటర్ ఎలా జరిగిందో వివరంగా చెప్పాను. ఆమె కొంచెం ఆలోచించి, "ఇందులో మూడు ప్రోబబిలిటీస్ ఉన్నాయి" అన్నది. "...ఒకటి– నిజంగానే ప్రభాకర్ పారి పోయే ప్రయత్నం చేసి, మనకి అబద్ధం చెప్పి ఉండవచ్చు. లేదా... ఇనస్పెక్టరూ, డ్రైవరూ కుమ్మక్కై ముద్దాయిని చంపి ఉండవచ్చు. లేక డ్రైవరు మామూలుగానే నేచర్ కాల్ కోసం ఆపితే, ఇనస్పెక్టర్ కాల్చి ఉండవచ్చు".

"నాకు కూడా ఈ అనుమానం వచ్చింది" అన్నాను. "...కానీ వెంకటేశ్వర్లు చెప్పిన దాని ప్రకారం ప్రభాకర్ వ్యాను దూకలేదు. ఇనస్పెక్టరే క్రిందికి దిగమని ఎన్‌కౌంటర్ చేశాడు".

"నేన్నీకు చెప్పేటంత పెద్దదాన్ని కాదు కానీ ఒక విషయం..! ఇటువంటి విషయాల్లో ఎవరినీ నమ్మటానికి లేదు. పోలీసు వెంకటేశ్వర్లు నిజం చెపుతున్నాడని నమ్మకం ఏమిటి? డ్రయివర్‌ని రక్షించటానికి అబద్ధం చెపుతూ ఉండవచ్చుగా."

ఈ ఆలోచన నాకు రాలేదు. ఆమె వైపు అభిమాన పూర్వకంగా చూశాను. ఇటువంటి విశ్లేషణే ఆమె నుంచి ఆశించింది. ఒకటికి రెండు బ్రెయిన్లు తోడయితే మంచిది అర్ధాంగి అంటే ఆలోచనల్లో సగం పంచుకునేది కదా.

"నువ్వు చెప్పింది నిజమే. ముందా విషయం తెలుసుకుంటే దీని వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరో తెలుస్తుంది" గుడి నుంచి బయటకి వస్తూ అన్నాను.

ఆమె ఆశ్చర్యంగా, "సూత్రధారా?" అన్నది.

"అవును. లేకపోతే ఒక అమాయకుడిని ఎన్‌కౌంటర్ చేసే అంత అవసరం ఎవరికి ఉంటుంది? రోడ్డు పక్కన కాల్చి చంపెయ్యటానికి అతనేం హత్యలూ, రేపులూ చేసిన మాఫియా లీడరు కాదు కదా".

"పోలీస్ వ్యాన్ డ్రైవర్ రాములేనా మాట్లాడేది?"

"అవును. మీరెవరు?"

"ఇనస్పెక్టర్ ప్రదీప్. సి.బి.ఐ. డెల్టా ఫోర్స్. హిట్ స్క్వాడ్" అన్నాను.

అట్నుంచి కంగారు, భయం నిండిన స్వరంతో "చెప్పండి సార్" అన్నాడు.

"ప్రభాకర్ ఎన్‌కౌంటర్ విషయంలో ఇనస్పెక్టర్ మురళిధర్‌ని అరెస్ట్ చేశాము. మా వాళ్ళు నీ దగ్గరకు వస్తున్నారు."

"నా...కు... నాకేమీ తె...లీ...దు సార్" అన్నాడు. చేప వలలో పడింది.

"తెలీదా? ఏం తెలీదు. మేము ఏమీ అడక్క ముందే 'తెలీదు' అంటున్నావంటే ఏదో తెలుసన్నమాట. మా వాళ్ళు అక్కడికి వచ్చాక ఏమి జరిగిందో వివరంగా చెపుదువు గాని. రెడీగా ఉండు".

"సార్ సార్. నాకేమీ తెలీదు సార్. ఖాళీగా ఉన్న చోట ఆపమన్నాడు. ఆపాను. అంతే సార్" అంటూ అతను ఇంకా ఏదో అనబోతూ ఉంటే సెల్ 'ఆఫ్' చేసి, ఫోనులోంచి 'సిమ్' తీసి డిస్ట్రాయ్ చేశాను.

సమస్యలో ఉన్నప్పుడు మనసు లాజిక్ ఆలోచించదు.

నేను ఫోన్ పెట్టేయగానే, వ్యాన్ డ్రైవర్ ఇనస్పెక్టర్‌కి ఫోన్ చేస్తాడనీ, తనని సి.బి.ఐ అరెస్ట్ చేయటం ఏమిటో అర్థం కాక మురళీధర్ కంగారు పడతాడనీ నాకు తెలుసు. ప్రభాకర్ ఎన్‌కౌంటర్ కోసం 'సుపారి' ఇచ్చిన వ్యక్తికి ఫోన్ చేసి ఈ విషయం చెప్తాడు. దాంతో మూల విరాట్టు ఎవరో తెలుస్తుంది. అదీ నా ఆలోచన..!

క్రిమినల్ లాయర్లందరికీ క్రిమినల్ బ్రెయిన్ ఉండకపోవచ్చు. కానీ నాది వేరే క్యాటగిరీ.

ఒక వ్యక్తి సెల్ నుంచి వెళ్ళిన, లేదా వచ్చిన కాల్స్‌ని ట్రాక్ చెయ్యటాన్ని సి.డి.ఆర్ (కాల్ డీటెయిల్స్ రికార్డ్) అంటారు. ఇనస్పెక్టర్ జనరల్ పర్యవేక్షణలో దీనికో స్పెషల్ బ్రాంచ్ ఉంటుంది. ఈ డిపార్ట్‌మెంటులో నాకో మిత్రుడు ఉన్నాడు. ఇనస్పెక్టరు మురళీధర్ ఫోన్ నుంచి ఆ రోజు వెళ్ళిన కాల్స్ పై నిఘా పెట్టమని అతడికి చెప్పి ఉంచాను.

ఇంటికి వెళ్లే సరికి అమ్మ ట్రావెలింగ్ ఏజెంట్ నుంచి టికెట్స్ తీసుకుని పరిశీలిస్తోంది. నన్ను చూసి కంగారు పడింది. నాన్నకు అలా ఉండగా ఆ టికెట్స్ ఏమిటో నాకు అర్థం కాలేదు.

"ఎక్కడికమ్మా ప్రయాణం" ఆశ్చర్యంగా అడిగాను.

"నేను, త్రినేత్రి మనాలీ వెళ్తున్నాము రా" అన్నది.

నా ఆశ్చర్యం ద్విగుణీకృతం అయింది. "ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మనాలీకా? అందులోనూ శీతాకాలం" అన్నాను.

"హిమాలయాల దగ్గర కేలాంగ్ అడవుల్లో ఒక కోయ సాధువు మూలికా రసం ఇస్తాడట. అది శరీరానికి రాస్తే, మూడు రోజుల్లో పక్షవాతం నయమైపోతుందట. ఇద్దరం వెళ్తున్నాం" అంది.

'మూడు రోజుల్లో పక్షవాతం నయమై పోయే మందు ఉంటే ఈ పాటికి ప్రపంచంలోని అన్ని ఫార్మా కంపెనీలూ ఆ సాధువు చుట్టూ తిరిగి ఉండేవి కదా' అందామనుకున్నాను. కష్టంలో ఉన్న అమ్మని మరింత బాధ పెట్టడం ఇష్టం లేక మౌనంగా ఉండిపోయాను.

ఆ సాయంత్రం త్రినేత్రితో నిష్టూరంగా, "ఇన్నాళ్ళ నుంచీ కలిసే ఉన్నాం కదా. మీ ప్రయాణం గురించి నా దగ్గర ఎందుకు దాచావు? చెప్తే ఏం పోయింది?" అన్నాను.

"ఇన్నాళ్ళ నుంచీ కలిసే ఉన్నాం కదా. దెయ్యంతో మాట్లాడుతూన్న సంగతి నా దగ్గర ఎందుకు దాచావు? చెప్తే ఏం పోయింది?" అంది.

రిటార్టుకి దెబ్బ తిని సర్దుకుంటూ, "నా ఉద్దేశ్యం... ప్రయాణం విషయంలో టిక్కెట్లు నేనే కొనేవాడిని కదా. ఆఖరి నిముషం వరకూ ఆపటం ఎందుకని?" అన్నాను.

"నా ఉద్దేశ్యం.. దెయ్యం విషయంలో నాకు తోచిన సలహా నేనూ చెప్పేదాన్ని కదా. ఇంత కాలం దాచటం ఎందుకని?"

"తల్లీ. నీ నోట్లో నోరు పెట్టలేను. నన్ను క్షమించు" చేతులు జోడించాను.

"పెళ్లయ్యే వరకూ నోరు కాదు. నోట్లో చిటికెన వేలు పెట్టినా ఊరుకునే వారెవరూ లేరిక్కడ".

"దెయ్యం గురించి చెప్తే నువ్వు ఎలా తీసుకుంటావో అని అనుమాన పడ్డాను నేత్రీ" రాజీకి వస్తున్నట్టూ అన్నాను. "అమ్మ ప్రయాణం గురించి అలా కాదు. నాన్నకి బాలేదని మొక్కుకోవటానికో, మనశ్శాంతి కోసమో పుణ్యక్షేత్రాలకి వెళ్తానంటే నేను ఎందుకు కాదంటాను?" అన్నాను.

"మీ అమ్మగారు వెళ్తూన్నది దానికి కాదు"

"మరి దేనికి?" కన్ఫ్యూజింగ్‌గా అడిగాను.

ఆమె నవ్వి "సస్పెన్స్" అంది.

ఈ దాగుడు మూతలాటకి నాకు ఒళ్ళు మండుతోంది కానీ, ఒక ఊహించని పరిణామానికి ఈ అత్తాకోడళ్ళు పునాది తవ్వుతున్నారని నేనా క్షణం అనుకోలేదు. ముఖ్యంగా నా తల్లి గురించి..! అసలు విషయం ఏమిటో చెప్పమని త్రినేత్రిని గట్టిగా అడగబోతూ ఉండగా ఫోన్ మ్రోగింది. ఆన్ చేసి "హలో" అన్నాను.

"నేనండీ. భానుమూర్తిని" అని అటునుంచి వినపడింది.

"ఏ భానుమూర్తి?" అన్నాను ఎవరో అర్థం కాక.

"ప్రభాకర్ చెల్లి..." అని అతడు అంటూ ఉండగా "...గుర్తు వచ్చింది... సారీ" అన్నాను.

"వరలక్ష్మి మీ నెంబరు ఇచ్చింది. మీరు మాకు చేస్తున్న సాయానికి కృతజ్ఞతలు సార్. మిమ్మల్ని కలుసుకోవాలి. నేను..." అతను ఆపకుండా చెప్పుకుపోతున్నాడు. అతన్నించి ఫోన్ వచ్చిన సంతోషం కన్నా, సీక్రెట్ ఫోన్ వాడకం పట్ల ఆ దంపతుల నిర్లక్ష్యం కోపం తెప్పించింది. తిట్టాలో, జాలి పడాలో తెలియక "మిమ్మల్ని ఎక్కడ కలవాలి?" అని అడిగాను.

అడ్రసు చెప్పాడు. వెళ్ళటానికి గంట పట్టింది. ఊరి చివర ఎవరో స్నేహితుడి అడవి లాంటి స్థలంలో తోటమాలి కోసం కట్టిన చిన్న గదిలో ఉంటున్నాడు. చూడగానే చేతులు పట్టుకుని "మీరొచ్చారు సంతోషం" అంటూ సడెన్‌గా ఏడవటం మొదలు పెట్టాడు.

నేను కాస్త కంగారు పడిన మాట నిజమే కానీ, అతడి మానసిక ఒత్తిడి అర్థం చేసుకోగలను. అప్పటి వరకూ ఒంటరిగా ఉంటూ, చాలా రోజుల తరువాత ఓ వ్యక్తి కనబడితే, దుఃఖం సహజం. జరిగింది చెప్తూ లాయర్ల దగ్గర క్లయింట్లు ఏడవటం అలవాటే కాబట్టి కొత్తగా అనిపించలేదు.

అతడి ఏడుపు చూస్తోంటే వరలక్ష్మి అదృష్టవంతురాలు అనిపించింది. సమస్య రాగానే భార్య మీద విరుచుకు పడే మొగుళ్ళ కన్నా, సమస్య రాగానే భార్య ఎద లోతుల్లో తల దాచుకునే వారి భార్యలు అదృష్టవంతులే కదా.

అతడితో ఏడుపు ఆపించటానికి "వచ్చినప్పటి నుంచీ ఇక్కడే ఉంటున్నారా?" అని అడిగాను చుట్టూ చూస్తూ.

"అవునండీ. అదృష్టవశాత్తూ నా స్నేహితుడికి ఫాంహౌస్ ఉండబట్టి సరిపోయింది".

దీన్ని ఫాంహౌస్ అంటారని కొత్తగా తెలుసుకున్నాను. నేనేదో అనబోతూ ఉంటే, అతడు వంట పాత్రల వైపు చూస్తూ, "ఏమి చెయ్యాలో తెలీదు. ఎవర్ని కలుసుకోవాలో తెలీదు. ఎన్నాళ్ళో తెలీదు. ఏమౌతుందో తెలీదు. వండుకోవటం. తినటం. పడుకోవటం. అంతే. ఇక్కడ నేనూ, అక్కడ వరలక్ష్మి..." అంటూ చెప్పుకు పోతున్నాడు. విషయాన్ని క్లుప్తంగా చెప్పలేక పోవటం ఇతడి నైజమని అర్థమై, "పదండి పోదాం" అన్నాను.

ఈ అనూహ్య ప్రపోజల్‌కి బిత్తరపోయి, "ఎక్కడికి?" అని అడిగాడు.

చెప్తే కంగారు పడతాడని, విజయవాడ రైల్వే స్టేషన్ వెయిటింగ్ రూమ్‌కన్నా అధ్వానంగా ఉన్న ఆ గది చూస్తూ, "ఇంతకన్నా బెటర్ ప్లేస్‌కి" అన్నాను. అతడి సూట్-కేస్ తీసుకుని ఇద్దరం బయటకు వచ్చాము. కార్లో థ్యాంక్స్ చెప్పాడు.

నేనేదో మంచి గెస్ట్-హౌసుకి తీసుకువెళ్తా అనుకున్నట్టున్నాడు. పోలీసు స్టేషన్ ముందు కారు ఆపేసరికి కంగారు పడ్డాడు. 'మంచి ప్లేస్ అంటే ఇదా?' అంటూ మళ్ళీ ఏడుపు ప్రారంభించబోతూ ఉంటే "...చూడండి భానుమూర్తీ. మీరు అక్కడున్న గది కంటే ఈ లాకప్ రూము బెటర్. 'ఆ చీకటి గదిలో ఎంతకాలం ఉండాలో తెలీద'ని మీరే అన్నారు కదా. అయినా ఆ అడవిలో ఎంత కాలం దాక్కుంటారు? మీ దంపతులు ఫోన్ వాడుతున్న విధానం చూస్తే, పోలీసులు ఈ రోజు కాకపోయినా రేపయినా మిమ్మల్ని లొకేట్ చేసి ఉండేవారు" అంటూండగా, రోడ్డుకి అటు పక్కన ఒక ఆటో వచ్చి ఆగింది.

ఆటోలోంచి దిగి పోలీస్ స్టేషన్ వైపు వస్తోన్న వరలక్ష్మిని చూపించి "మీ ఆవిడ" అన్నాను.

తన కళ్ళని తానే నమ్మలేనట్టూ భానుమూర్తి నా వైపు తిరిగాడు. 'నేనే పిలిచా' అన్నట్టు తలూపాను.

ట్రాఫిక్‌ని కూడా పట్టించుకోకుండా ఒక్క ఉదుటున అటు పరుగెత్తాడు.

ఆమె అట్నుంచి, ఇతడు ఇట్నుంచీ వెళ్లి రోడ్డు మధ్యలో కౌగిలించుకున్నారు.

వాళ్ళ సంగతి ముందే తెలుసు కాబట్టి నాకు అదేమీ చిత్రం అనిపించలేదు కానీ, ఆ దృశ్యం చూస్తూ తదాత్ముడైన ఓ త్రిచక్రవాహన చోదకుడు, అదే దృశ్య వీక్షణాసక్తుడి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. వాడూ, వీడూ కొట్టుకుంటూ ఉండగా మేము పోలీసు స్టేషను మెట్లు ఎక్కాము.

– 24 –

ఏదో పని చేసుకుంటున్న మురళీధర్ మా అడుగుల చప్పుడుకి తలెత్తి, ఏం కావాలన్నట్టూ చూశాడు. నా వెనుకే వస్తూన్న భానుమూర్తిని అతడు గుర్తు పట్టలేదు.

"నా పేరు ఆనంద్. లాయర్‌ని" అన్నాను.

అతడు కుర్చీలోంచి ఉద్వేగంగా లేచి, "ఆనంద్ సార్. మీరా? మీరు ఇక్కడికా? నమస్తే సార్. రండి. కూర్చోండి. కాఫీ తెప్పించనా?" అనలేదు. అంటాడని నేను అనుకోలేదు కూడా. లాయర్లని చూసి పోలీసులు కుర్చీలోంచి లేవరు.

వంటింట్లో పిల్లిని చూసినట్టు 'ఇక్కడికి ఏ పని మీద వచ్చావ్' అన్నట్టు చూస్తారు. అతడలాగే అభావంగా చూసి, "ఆనంద్ ఫాల్కీవాలా?" అన్నాడు.

"కాదు ఉట్టి ఆనంద్. ఇతడు నా క్లయింట్ భానుమూర్తి" అన్నాను. అప్పుడు గుర్తు పట్టాడు. కుర్చీ లోంచి లేచి, "ఏరా. ఇంతకాలం ఎక్కడ దాక్కున్నావ్?" అని అడిగాడు. అతడి ఆవేశం చూస్తే కోర్టుకి వెళ్ళే అవసరం లేకుండా అక్కడే ఉరిశిక్ష వేసేసేటట్టూ కనపడ్డాడు.

భానుమూర్తి బెదిరి పోయి నా వెనుక దాక్కున్నాడు. ఆఫర్ చెయ్యకుండానే కుర్చీ లాక్కొని కూర్చుంటూ, "నా దగ్గరే ఉన్నాడు. యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నించాం. 'మర్డర్ కేసు కదా. ముందు లొంగిపొమ్మనండి' అన్నారు జడ్జీగారు. అందుకే సరెండర్‌కి తీసుకుని వచ్చాను" భానుమూర్తి దంపతులని కూడా కూర్చోమన్నట్టూ సైగ చేస్తూ అన్నాను. వారు కూర్చోలేదు.

"మీరు బెయిల్‌కి వెళ్ళినట్టూ కోర్టు నుంచి మాకేమీ నోటీసు రాలేదే" అనుమానంగా అన్నాడు ఇనస్పెక్టరు.

"కోర్టులో కాదు. చర్చ జడ్జీగారి ఇంట్లో జరిగింది" అన్నాను. అతడికి అర్థమైందని నాకు అర్థమైందని అతడికి అర్థమైంది. నవ్వాడు. మేము ఏమి మాట్లాడుకుంటున్నామో అర్థంకాక భానుమూర్తి దంపతులు అయోమయంగా చూస్తున్నారు.

హెడ్డుని పిలిచి ఫార్మాలిటీస్ పూర్తి చెయ్యమని చెప్పాడు. భానుమూర్తి అతడితో కలిసి పక్క రూములోకి వెళ్ళాక, కవరు ముందుకు తోస్తూ, "బెయిల్ రావటానికి ఎక్కువ కాలం పట్టదని అనుకుంటున్నాను. కాస్త మా వాడిని జాగ్రత్తగా చూసుకోండి" అన్నాను.

"మీ క్లయింటా? స్వయంగా మీరే ఇస్తున్నారంటే బహుశా మీ బంధువై ఉంటాడు"

"అవును. మా చెల్లెలి మొగుడు" అన్నాను వరలక్ష్మిని చూపిస్తూ. నా మాటలు విని ఆమె కళ్ళు తడి అవటం గమనించాను. ప్రతి చిన్న విషయానికీ అతిగా స్పందించటం ఈ దంపతులకి అలవాటు అనుకుంటాను.

భానుమూర్తి లాకప్-సెల్ లోకి వెళ్ళాక, షేక్-హాండ్ ఇచ్చి సెలవు తీసుకున్నాను. వ్యాన్ డ్రైవర్‌కి ఫోన్ చేసింది నేనేనని మురళీధర్‌కి నా మీద ఈషణ్మాత్రం కూడా అనుమానం రాలేదు. ముద్దాయిని సరెండర్ చేసింది నేను..! పైగా బాగా చూసుకోమని లంచం కూడా ఇచ్చాను..! కాబట్టి నా మీద అనుమాన పడే అవకాశం లేదు.

ఇద్దరం స్టేషను బయటకి వచ్చాం. రోడ్డు మీద ఆటో మనిషీ, స్కూటరువాడూ ఇంకా దెబ్బలాడుకుంటున్నారు.

"చేతులు తడిపాము కాబట్టి గచ్చు కడిగించరు. సెల్‌లో ఫ్యాను అరేంజ్ చేస్తారు. ఇంటి నుంచి మీరు వండి తీసుకు రావచ్చు. సెల్ ఫోను దిండు క్రింద దాచుకోనవసరం లేదు. మీరిద్దరూ ధైర్యంగా మాట్లాడుకోవచ్చు. బెయిల్ కోసం ఈ రోజే అప్లయ్ చేస్తాను" అన్నాను.

ఆ మాటలకి వరలక్ష్మి కదిలిపోయి "ఈ చీకటి బతుకు ఎంతకాలం బతకాలో తెలియక అల్లల్లాడి పోయాము అన్నయ్యా. దేవుడు ఇచ్చినట్టూ వచ్చావు" అంటూ వంగి కాళ్ళకి దణ్ణం పెట్టింది.

ఇద్దరం కారు ఎక్కాము. 'గంట క్రితం రోడ్డు మీద కౌగిలించుకున్నది ఎవరిని? ఇప్పుడు కార్లో వెళుతున్నది ఎవరితో?" అని వాహనదారులు పోరాటం ఆపి చూస్తూ ఉండగా బయల్దేరాము.

ఆమెని ఇంటి దగ్గర దింపుతూ క్యాజువల్‌గా "మరణించిన ఆరుషి నీకు తెలుసా?" అని అడిగాను.

"నాకెందుకు తెలీదు? మా వదినేగా" అన్నది.

కారు బ్రేక్ వేయబోయి అతి కష్టం మీద నిభాయించుకొని "వదినా?" అన్నాను.

"అవును. ఆరుషి మా వారి చెల్లెలు" అంది.

"తనకి ఎవరూ లేరు. హాస్టల్లో ఉంటుందని విన్నానే"

"నిజమే. ఆరుషి మావారి చిన్నాన్న కూతురు. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోతే సొంత చెల్లెల్లా చూసుకుని చదివించారు. భానుమూర్తి తండ్రి ఆస్తిపరులు. చాలామందికి చేయూత ఇచ్చారు. అదే గుణం మా వారికీ వచ్చింది. ఇప్పటికీ చాలామందిని చదివిస్తూ ఉంటారు."

మొహం మీద ఎవరో సాచి పెట్టి కొట్టినట్టు అయింది. చిన్న చిన్న విషయాలకే ఏడుస్తున్న భానుమూర్తిని చూసి ఏర్పడిన చులకన భావం, ఈ ఒక్క మాటతో పోయింది. మనుష్యుల మీద తొలి అభిప్రాయం ఎంత అవాస్తవంగా ఏర్పడుతుందో, అది తప్పని తరువాత తెలిసినప్పుడు ఎంత అపరాధ భావం కలుగుతుందో అనుభవంలోకి వచ్చింది.

"ప్రభాకరన్నయ్యకి ఆరుషి వదిన్ని పరిచయం చేసింది మా ఆయనే. వాళ్ళిద్దరూ అతి తొందరలో మంచి స్నేహితులయ్యారు. పెళ్లి చేసుకుందామని కూడా అనుకున్నారు. ఈ లోపులో ఇలా జరిగింది" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది. ఈ సారి నాకు నవ్వు రాలేదు. ముచ్చటగా మల్లెపొదలా అల్లుకున్న ఆ కుటుంబాన్ని చూస్తే ముచ్చట వేసింది. నాకు చెల్లెళ్ళు లేరు. మా ఇంట్లోవారితో ఎప్పుడూ అభిప్రాయ బేధాలే.

"ఆరుషి గురించి మరిన్ని వివరాలు కావాలంటే నీ భర్త చెపుతారు కదా" అని అడిగాను.

"చెబుతారు. వాళ్లు సొంత అన్నాచెల్లెళ్ళ కన్నా ఆప్యాయంగా ఉండేవాళ్ళు."

ఆమెను ఇంటి దగ్గర దింపి సెలవు తీసుకుంటూ "నీ హస్బెండ్ గురించి ఏమీ కంగారు పడకు. పది రోజుల్లో బెయిల్ మీద బయటకు తీసుకువచ్చే బాధ్యత నాది. ఈ కేసు నుంచి కూడా" అన్నాను. రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments